
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

5

మంగళవారం 8 జూలై 2025

జిల్లాల వార్తలు



ఒలింపిక్స్ పతకాల

సాధనే లక్ష్యం

క్రీడల అభివృద్ధికి రూ.800 కోట్లు!

హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ కోర్టు మంజూరు

క్రీడలు, యువజన, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

7

పునరావాసకాలనీలో

మైక్రోఫైనాన్స్ మహమ్మారి

రుణ ఉచ్చులో నిర్వాసితులు

ఉపాధి లేక ఆస్తులు తాకట్టు

వందకు పైగా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు

7

పొన్నంకు పగ్గాలు

ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మంత్రి ప్రభాకర్

స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాల వారీగా సీనియర్ నేతలను ఇన్‌చార్జులుగా నియమించింది. అందులో భాగంగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా బాధ్యతలు అప్పగించింది. తక్షణమే రంగంలోకి దిగాలని కాంగ్రెస్ అధిష్ఠానం సూచించింది. బీఆర్ఎస్‌కు కంచుకోటగా పేరున్న మెతుకుసీమలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడానికి కీలక నిర్ణయం తీసుకుంది. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డిని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 7

- తక్షణమే రంగంలోకి దిగాలన్న అధిష్ఠానం
- స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలే టార్గెట్
- మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల వారీగా సమీక్షలు
- కాంగ్రెస్‌లో కరడుగట్టిన నేతగా పేరున్న పొన్నం
- హైదరాబాద్ ఇన్‌చార్జిగా జగ్గారెడ్డి



పొన్నం ప్రభాకర్



తూర్పు జగ్గారెడ్డి

స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 లోపు నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర హైకోర్టు సూచనలు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావొచ్చనే సంకేతాలు ఉన్నాయి. గ్రామాల్లో కీలకమైన ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను రాబట్టాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జులను నియమించింది.

గులాబీ పార్టీనే టార్గెట్..

బీఆర్ఎస్ పార్టీ పురిటిగడ్డగా, తెలంగాణ ఉద్యమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉమ్మడి మెదక్ జిల్లాకు పేరుంది. 2001లో పార్టీ ఆవిర్భావం వరకు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. ఇక్కడి నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్దసంఖ్యలో ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభావం క్రమంగా తగ్గింది. నాటి టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలోని గ్రామగ్రామాన వేళ్లూనుకుంది. గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. ఇక అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ మీద పైచేయి సాధించింది. మెదక్

మిగతా 6వ పేజీలో

పరిశ్రమల్లో భద్రతా లోపం..

కార్మికులకు శాపం



నిబంధనల ఉల్లంఘనే ప్రమాదాలకు కారణం

ఫ్యాక్టరీల అనుమతులు వేరు.. ఉత్పత్తులు వేరు

నైపుణ్యం లేని వలస కార్మికులతో ప్రమాదకరమైన పనులు

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పీసీబీ తనిఖీలేవి?

సిగాచి పేలుడు ఘటనతో అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం

7

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో వందల సంఖ్యలో చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? నిబంధనలను అమలు చేస్తున్నారా? కార్మికులకు సురక్షిత వాతావరణం కల్పిస్తున్నాయా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. పరిశ్రమల శాఖ అధికారులు, కంపెనీ యాజమాన్యాలు కుమ్మక్కై నిబంధనలను అటకెక్కిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

'సిగాచి' పరిహారం నిజమైన

బాధితులకు అందేనా?

పరిహారంపై సందేహాలు.. నకిలీ కుటుంబ సభ్యుల హల్‌చల్

మొన్న బాధితుడి భార్యనంటూ యువతి హల్‌చల్

ఎంపీ లెటర్‌తో బురిడీ కొట్టించేందుకు కేటుగాడి విఫలయత్నం



బాధిత కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

పటాన్‌చెరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సిగాచీ దారుణ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన భారీ ఆర్థిక పరిహారం నిజమైన లబ్ధిదారులకు అందుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు పరిశ్రమలోనే సజీవదహనం కాగా, మరికొందరు పూర్తిగా కాలిపోయి, ఇంకొందరు గుర్తుపట్టలేని స్థితిలో మృతి చెందారు. తీవ్ర గాయాలతో బాధపడుతూ భవిష్యత్తులో జీవచ్ఛవాలుగా మారే ప్రమాదం ఉన్నవారున్నారు. ఈ నేపథ్యంలో రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

భారీ పరిహారం ప్రకటనలు

ప్రమాదంలో కార్మికులు మృతి చెందిన తీరును చూసి ప్రతీ ఒక్కరు చలించిపోయారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు బాధితులకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ. పది లక్షలు చెల్లిస్తామని తెలిపారు. ప్రభుత్వ జోక్యంతో 'సిగాచీ' యాజమాన్యం సైతం కార్మికులను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం సైతం ఒక్కో బాధితుడికి రూ. రెండు లక్షల చొప్పున అందిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కింద ఇప్పటివరకు 42 మంది కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున అందజేశారు. ఇంకోవైపు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాధితులకు పరిహారం ఇస్తామని అంటున్నాయి. ఒడిశా ప్రభుత్వం బాధితులకు రూ. ఆరు లక్షలు ప్రకటించింది.

డీఎన్ఏ నిర్ధారణ తప్పనిసరి

మృతదేహాలను అప్పగించడంలో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, వైద్య సిబ్బంది అన్ని రకాలుగా నిర్ధారించుకున్న తర్వాతే అప్పగింతలు జరుగుతున్నాయి. గుర్తుపట్టలేని మృతదేహాలను డీఎన్ఏ ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ప్రాధాన్యత క్రమంలో ముందుగా మృతుల భార్యలకు, లేదా తల్లిదండ్రులకు, వారు రాలేని స్థితిలో సోదరులకు అప్పగించారు. వారి ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులతో పాటు డీఎన్ఏ నివేదికలను భద్రపరుస్తున్నారు. మృతదేహాల వెంట పొరుగు రాష్ట్రాలకు వెళ్లిన అంబులెన్సుల్లో ఇద్దరు కానిస్టేబుళ్లు ఎస్కార్ట్‌గా వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యేంత వరకు అక్కడే ఉండి, ఆ గ్రామ పెద్దలు, స్థానిక పోలీసు స్టేషన్‌లో మృతుడి వివరాలను నిర్ధారించుకుని మరీ వస్తున్నారు. ఇంత జాగ్రత్తగా ఉన్నా బాధితుల కుటుంబ సభ్యుల పేరిట

మిగతా 7వ పేజీలో



నల్లవాగుపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జిల్లాల మధ్య రహదారులను

అనుసంధానించాలి

రోడ్ల అభివృద్ధికి నిధుల కొరత లేదు

రవాణా సౌకర్యాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

7

మెరుగైన బోధనకు మరో వ్యవస్థ

పాఠశాలల పర్యవేక్షణకు తనిఖీ కమిటీలు

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



మల్లంపేట ప్రాథమిక పాఠశాలలో బోధనాభ్యసన తీరును పరిశీలిస్తున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియ తీరును పర్యవేక్షించేందుకు మరో కొత్త వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. విద్యాశాఖ పాఠశాలల వారీగా బోధన తీరు, విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించేందుకు ఉపాధ్యాయులతో కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో మొత్తం పాఠశాలలు 922, క్లస్టర్స్ 61 పరిధిలో ఈ బృందాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు కొనసాగుతున్నది. మరోవైపు ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, నోడల్ అధికారులు, డీఈవోలు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు వివిధ స్థాయిలో పర్యవేక్షణ విధులు నిర్వర్తిస్తున్నారు. అదనంగా కొత్త వ్యవస్థ ఏర్పాటుతో కొత్త సమస్యలు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రత్యేక బృందాల విధులు

తాజాగా నియమించనున్న తనిఖీ కమిటీ సభ్యులు తమ పరిధిలోని పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియ, మధ్యాహ్న భోజనం, విద్యా విషయాక అంశాల అమలు, మౌలిక వసతులు, హాజరు తదితర కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. తనిఖీల్లో గుర్తించిన వివరాల ఆధారంగా నివేదికలు అందిస్తారు. వీటిపై కలెక్టర్ సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటారు.

మార్గదర్శకాలు ఇవే..

కొత్తగా కమిటీల్లో నియమించే ఉపాధ్యాయులకు కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం తప్పనిసరి. టెక్నాలజీలపై పరిజ్ఞానం అవసరం. ఫలితాలపై దృష్టి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. పాఠశాలల్లో పాఠ్యాంశాలు, లెసన్ ప్లాన్‌ల పరిశీలన, ప్రయోగశాలలు, స్పోర్ట్స్ గ్రంథాలయాలు, డిజిటల్ ఎడ్యుకేషన్, సహ పాఠ్య కార్యకలాపాలు, ఆరోగ్య తనిఖీలు, తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, ఆటస్థలం, ఆడిటోరియం, ప్రహరీ పరిశీలన, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ పరిస్థితి, పాఠ్యప్రణాళిక, ఫలితాలను పరిశీలించాల్సి ఉంటుంది.

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



ఇప్పటికే విద్యా వ్యవస్థలో పలు రకాల పర్యవేక్షణ వ్యవస్థలు కొనసాగుతున్నాయి. మళ్లీ తనిఖీ అధికారుల నియామకం అవసరం లేదు. తనిఖీల ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి.

-రాజ్‌గోపాల్ గౌడ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రస్తుత వ్యవస్థనే పటిష్ఠం చేయాలి



ప్రస్తుతం డీఈవో, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎన్వో, ఏఎంవోలు పర్యవేక్షణ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయా పోస్టులను భర్తీ చేసి వ్యవస్థను బలోపేతం చేస్తే సరిపోతుంది.

-కొంగటి యాదగిరి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఓపెన్ స్కూల్‌తో

చదువు కొనసాగింపు

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ ద్వారా ఆగిపోయిన చదువు కొనసాగించవచ్చని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆమె కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఓపెన్ విద్యార్హత ఉద్యోగాలు, ఉన్నత చదువులకు, ఇతర ఉపాధి అవకాశాలకు రెగ్యులర్ డిగ్రీలతో సమానంగా ఉపయోగపడుతుందని తెలిపారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 11 వరకు ప్రవేశాల గడువు ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, వయోజన విద్య డీడీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తిని విజయవంతం చేయండి

సంగారెడ్డి రూరల్: ఇందిరా మహిళా శక్తి స్వయం ఉపాధి పథకాలు విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని కలెక్టర్ ప్రావిణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా చేపట్టిన పథకాలు సజావుగా సాగేలా చూడాల్సి బాధ్యత జిల్లా మహిళా సమైక్య, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులపై ఉందన్నారు.

యూపీఎస్సీ కోచింగ్ దరఖాస్తుకు గడువు నేడే ఆఖరు

సంగారెడ్డి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసేందుకు గడువు నేటితో ముగుస్తుందని సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 30.4.2026 వరకు సైదాబాద్ లక్ష్మీనగర్‌కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఈ నెల 12వ తేదీన నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 9494390803, 08455-277015 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.



జహీరాబాద్ పట్టణం హోతి(కే)లో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లు

డబుల్‌బెడ్రూం ఇళ్ల అప్పగింతకు

ముహూర్తం ఖరారు

- ఈ నెల 12న ప్రత్యేక కార్యక్రమం
- అధికారులు, నాయకుల నిర్ణయం
- పదేళ్ల నిరీక్షణకు తెర

జహీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల అప్పగింతకు ముహూర్తం ఖరారయ్యింది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల నెరవేరనున్నది. ఈ నెల 12న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు తాళాలు అప్పగించాలని అధికారులు, నాయకులు నిర్ణయించారు. లబ్ధిదారులకు సమాచారాన్ని సైతం చేరవేశారు. దీంతో ఇటీవల ఇళ్ల కోసం లబ్ధిదారులు చేపట్టిన ఆందోళనకు ఫలితం అందివచ్చినట్లైంది.

డబుల్ నిర్మాణాలు ఇలా

పది సంవత్సరాల క్రితం జహీరాబాద్ నియోజకవర్గంలో 1,100 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు నిర్మించి ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. జహీరాబాద్ పట్టణంలోని రహ్మత్‌నగర్‌లో 320, కోహీర్ మండలం దిగ్వాల్‌లో 20, హోతి(కే) గ్రామ సమీపంలో పది ఎకరాల స్థలంలో రూ.34.98 కోట్ల వ్యయంతో ఒక్కోబ్లాక్‌లో 24 ఇళ్ల చొప్పున 27 బ్లాకుల్లో కలిపి 700 ఇళ్లను నిర్మించారు. 40 ఇళ్ల పస్తాపూర్‌లో నిర్మించి లబ్ధిదారులకు కేటాయించారు. ఇళ్ల కోసం వేలాదిగా దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ, వివిధ కారణాల వల్ల అప్పట్లో లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయలేదు. ఇళ్ల స్వాధీనం చేయాలని ఇటీవల లబ్ధిదారుల ధర్నా చేయడంతో అధికారులు, నాయకులు స్పందించారు.



డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ధర్నా చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

సర్టిఫికెట్లు ఉన్న వారందరికీ ఇళ్లు అందజేస్తాం

గతంలో లాటరీ ద్వారా ఎంపికై సర్టిఫికెట్లను పొందిన వారందరికి ఇళ్లను అప్పగించాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన లిస్టు మా వద్ద కూడా ఉంది. ఈ నెల 12న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి డబుల్‌బెడ్‌రూంల తాళాలను స్వాధీనం చేయాలని నిర్ణయించాం. ఎంపికైన వారందరికీ ఇళ్లను అందజేస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు.

-దశరత్, తహసీల్దార్

వేలూరు హత్య కేసు ఛేదన.. నిందితుడి అరెస్ట్

వర్గల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన రాయన్న నర్సయ్య హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 5న సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద నర్సయ్యపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వేలూరు గ్రామానికి చెందిన చింతకింది రాజు(39), హత్యకు గురైన రాయన్న నర్సయ్య మధ్య కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. 5వ తేదీ సాయంత్రం నిందితుడు చింతకింది రాజు తన వ్యవసాయ పొలం వద్ద పనిచేస్తుండగా, అక్కడకు వచ్చిన నర్సయ్య తన పొలంలో పచ్చగడ్డి ఎందుకు వేశావని ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టాడు. కోపంతో రాజు తన చేతిలో ఉన్న పారతో నర్సయ్య మెడ, తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నేరం అంగీకరించడంతో రాజును రిమాండ్‌కు తరలించారు.

తూప్రాన్‌లో గంజాయి పట్టివేత.. నలుగురి అరెస్ట్

తూప్రాన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): వెంచర్‌లో గంజాయి సేవిస్తూ విక్రయాలు సాగిస్తున్న నలుగురిని పట్టుకుని 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపారు. ఐదు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.3వేల నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉండగా, ఇద్దరు మైనర్లు ఉన్నారని చెప్పారు. సోమవారం అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె

చిన్నశంకరంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన మాన్నె తర్నమ్మ (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతురాలి భర్త కొన్ని సంవత్సరాల క్రితం మరణించాడు. కుమారులు లేకపోవడంతో కుమార్తె తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది.

'పొన్నం'కు పగ్గాలు

(5వ పేజీ తరువాయి)

పార్లమెంటులో 20 ఏళ్లపాటు వరుసగా గులాబీ జెండా ఎగురవేశారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, పటాన్‌చెరు, జహీరాబాద్, హుస్నాబాద్, సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు బలమైన క్యాడర్ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏడు స్థానాల్లో విజయం సాధించిన ఘనత ఉమ్మడి జిల్లాలోని బీఆర్‌ఎస్ అభ్యర్థులకు దక్కింది. కావున రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆధిపత్యాన్ని తగ్గించడానికి కాంగ్రెస్ పార్టీ కీలక నేతలను బరిలోకి దింపుతోంది. ఎన్నికల్లో సత్తా చాటే ప్రయత్నాలను ఇప్పటి నుంచే మొదలుపెట్టింది.

బీజేపీపైనా ఫోకస్...

ఉమ్మడి జిల్లాలో బీజేపీ సైతం పుంజుకున్నట్లుగా గడిచిన ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. దుబ్బాక ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలిచిన నాటి నుంచి ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం వచ్చింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ పలుచోట్ల బీజేపీ అభ్యర్థులు పోటీ ఇచ్చారు. గతేడాది జరిగిన మెదక్ పార్లమెంటు స్థానంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ విజయం సాధించడం సంచలనమైంది. జహీరాబాద్ స్థానంలోనూ బీజేపీ అభ్యర్థి రెండో స్థానంలో నిలిచారు. ఇక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీకి బలం చేకూరింది. స్థానిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ బీజేపీ తరఫున పోటీచేస్తామని చాలామంది ముందుకొస్తున్నారు. దీంతో బీజేపీ చర్యలను సైతం అధిగమించడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించడానికి సిద్ధమైంది.

పొన్నం సరైనోడని..

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పట్టు సాధించాలంటే సరైన నాయకుడికే బాధ్యతలు అప్పగించాలని యోచించారు. అందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ పేరును ఖరారు చేశారు. ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం ద్వారా రాజకీయ అరంగేట్రం చేసి అంచెలంచెలుగా ఎదిగారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించారు. యూత్ కాంగ్రెస్ నేతగా, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్‌గా పనిచేశారు. 2009లో కరీంనగర్ ఎంపీగా విజయం సాధించి తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారు. ఆ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో ఓడినప్పటికీ 2023లో మళ్లీ హుస్నాబాద్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. సీనియర్ నేత కోటాలో మంత్రి పదవి పొందారు. ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలో భాగమైన సిద్దిపేట జిల్లా నుంచి మంత్రిగా ఉన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలను సైతం ప్రభావితం చేయగలరనే విశ్వాసంతో పార్టీ ఈ బాధ్యతలు అప్పగించినట్లుగా తెలుస్తోంది. దీనికితోడు ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ను నాయకత్వలేమి పట్టిపీడిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల వారీగా సమీక్షలు చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

జగ్గారెడ్డికి కీలక బాధ్యతలు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డికి కాంగ్రెస్ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా ఆయనను నియమిస్తూ టీపీసీసీ ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ కౌన్సిలర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి మున్సిపల్ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నేతగా జగ్గారెడ్డికి పేరుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ గత పార్లమెంటు ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు పడేలా ప్రయత్నించి సఫలమయ్యారు. గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తనవంతు పాత్ర పోషించారు. బీఆర్‌ఎస్, బీజేపీకి సరైన కౌంటర్లు విసరడంలో దిట్టగా గుర్తింపు పొందారు. ఇక గడిచిన అసెంబ్లీ, కార్పొరేషన్ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు చేదు ఫలితాలు రావడంతో జగ్గారెడ్డిని బరిలోకి దింపితే ప్రయోజనం ఉంటుందనే కోణంలో పార్టీ ఆలోచించినట్లుగా తెలుస్తోంది.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

- ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం
- ఉమ్మడి మెదక్ జిల్లా

డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ

సిద్దిపేట క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. సోమవారం సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రజలు రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి సేవలను పొందాలన్నారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ కింద స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఎక్కువ మందిని ఎక్కిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఆయన వెంట జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఏవో నజీర్ తదితరులు ఉన్నారు.

జింకను చంపిన వీధి కుక్కలు

లక్ష్మాపూర్ శివారులో ఘటన


కుక్కల దాడిలో చనిపోయిన జింక

రామాయంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అడవి నుంచి దారితప్పి ఊర్లోకి వచ్చిన జింకను వీధి కుక్కలు వేటాడి చంపేశాయి. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ శివారులో సోమవారం జరిగింది. ఉదయం గ్రామ శివారులో కుక్కల అరుపులు విన్న పలువురు అక్కడికి వెళ్లేసరికే జింక ప్రాణాలు కోల్పోయింది. గ్రామస్థులు వెంటనే అటవీ అధికారులకు సమాచారం చేరవేయగా, డిప్యూటీ రేంజర్ కుబ్బుద్దీన్ సిబ్బందితో చేరుకొని వెటర్నరీ వైద్యులతో పంచనామా చేయించారు. అనంతరం జింక కళేబరాన్ని గొయ్యి తవ్వి పాతిపెట్టారు. మృత్యువాత పడ్డ జింక కొమ్ములు విరిగి ఉండటంతో అది ఐదేళ్ల వయసు ఉంటుందని ఆయన తెలిపారు. లక్ష్మాపూర్ ప్రాంతం అడవులకు ఆనుకొని ఉండటంతో తరచు జింకలు దారితప్పి వస్తున్నాయి. ఐదు నెలల క్రితం కూడా ఓ జింక ఇలాగే వచ్చి కుక్కల దాడికి బలవగా, ఏడాదిన్నర క్రితం మరో జింక కూడా కుక్కల వేటకు బలైందని అధికారులు తెలిపారు.

కుక్కల దాడిలో కొండ గొర్రెకు గాయాలు

తూప్రాన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతం నుంచి ఊరు శివారులోకి వచ్చిన కొండ గొర్రెపై కుక్కలు దాడి చేయడంతో గాయాలైన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని అల్లాపూర్ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అల్లాపూర్ శివారులోని మాజీ కౌన్సిలర్ జిన్న భగవాన్‌రెడ్డి పొలం వద్దకు వచ్చిన కొండ గొర్రెపై ఊర కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన కొండ గొర్రెను భగవాన్‌రెడ్డి గుర్తించి గ్రామానికి చెందిన మానుక యాదగిరి సహాయంతో పట్టుకున్నారు. అటవీ అధికారులకు సమాచారం అందజేయగా, బీట్ ఆఫీసర్ చిరంజీవి అల్లాపూర్ వచ్చి, గాయపడిన కొండ గొర్రెను తూప్రాన్ పశువుల ఆసుపత్రికి తరలించారు. పశువుల ఆసుపత్రిలో సెక్షన్ ఆఫీసర్ ఓంప్రకాష్, బీట్ ఆఫీసర్ చిరంజీవి వైద్యం చేయించి, గుండ్రెడ్డిపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు అటవీ అధికారులు వివరించారు.

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి రైతు మృతి

కౌడిపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మూర్ఛతో పొలంలోనే పడి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బురుగడ్డలో సోమవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల రాములు (54) రోజులాగే సోమవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. కాసేపటి తర్వాత చుట్టుపక్కల రైతులు గమనించి రాములు వద్దకు వెళ్లి చూడగా బురదలో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పొలంలోకి వచ్చి చూడగా అప్పటికే రాములు మృతి చెంది ఉన్నాడు.

చెల్లె వివాహానికి ఆర్థిక కష్టాలతో అన్న ఆత్మహత్య

రామచంద్రాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చెల్లెలి వివాహానికి ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయన్న మనస్తాపంతో ఓ అన్న ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. కిష్టారెడ్డిపేటకు చెందిన బసవరాజు(32) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల అతనికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు కావడంతో, కొల్లూరులోని కేసీఆర్‌నగర్‌కు కుటుంబసభ్యులతో కలిసి మకాం మార్చాడు. ఈ మధ్యకాలంలో తన చెల్లెలికి వివాహం కుదిరింది. అయితే, వివాహానికి కావలసిన డబ్బు సమకూర్చడం తనతో కాదని తీవ్ర మనస్తాపానికి గురైన బసవరాజు ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

రాయపోల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎల్కల్‌కు చెందిన మొహమ్మద్ షాదుల్లా (36) తన ఇంట్లో జరిగిన కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుని తల్లి మొహమ్మద్ రాజంబి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాడూరు శివారులో చైన్‌స్నాచింగ్

చేర్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామంలో దింపుతామని నమ్మబలికి వృద్ధురాలిని బైక్‌పై ఎక్కించుకున్న ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయిన సంఘటన చేర్యాల మండలం తాడూరు గ్రామ శివారులో చోటుచేసుకుంది. తాడూరు గ్రామానికి చెందిన ఈరు యాదయ్య, సత్తమ్మ మర్యాక్‌లోని పాండురంగాశ్రమంలో ఆషాఢి ఉత్సవాలకు హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మధ్యాహ్నం తాడూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు దిగి బస్ షెల్టర్ వద్ద వేచి ఉన్నారు. ఇంతలో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా, యాదయ్య అతని బైక్ ఎక్కాడు. కొంతసేపటి తర్వాత ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఇంటి వద్ద దింపుతామని నమ్మబలికి సత్తమ్మను బైక్ ఎక్కించుకున్నారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత సత్తమ్మ మెడలోంచి 4 తులాల బంగారు గొలుసు లాక్కుని మద్రిముస్త్యాల శివారు మీదుగా పారిపోయారు. పుస్తెలతాడు లాక్కోవడంతో సత్తమ్మ మెడకు గాయం కావడంతో చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

మద్యం మత్తులో టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

రేగోడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు టవరెక్కి గంటపాటు హల్‌చల్ సృష్టించాడు. రేగోడు గ్రామానికి చెందిన నవీన్ సోమవారం సాయంత్రం మద్యం మత్తులో తన డబ్బులు ఎత్తుకెళ్లారని ఆగ్రహంతో బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కాడు. గ్రామస్థులు ఎంత నచ్చజెప్పినా కిందకు దిగకపోగా, అటుగా వెళ్తున్న రేగోడు గొల్ల చంద్రశేఖర్ పోగొట్టుకున్న డబ్బులు ఇస్తాను, టవర్ దిగు అని చెప్పడంతో నవీన్ కిందకు దిగాడు. తర్వాత డబ్బులు ఇచ్చి అతడిని ఇంటికి పంపించారు.



పరిశ్రమల్లో భద్రతా లోపం..
కార్మికులకు శాపం

నిబంధనల ఉల్లంఘనే ప్రమాదాలకు కారణం

ఫ్యాక్టరీల అనుమతులు వేరు.. ఉత్పత్తులు వేరు

నైపుణ్యం లేని వలస కార్మికులతో ప్రాణాంతక పనులు

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పీసీబీ తనిఖీలేవి?

సిగాచి పేలుడు ఘటనతో అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం

పారిశ్రామికవాడలో ప్రమాదాలు, కార్మికుల ప్రాణాలు గాలిలో కలవడానికి ప్రధాన కారణం అధికారుల నిఘా లోపం, కొంతమంది అవినీతి, పరిశ్రమ యాజమాన్యాల నిర్లక్ష్యమేనని స్పష్టమవుతోంది. గతంలో ఏదైనా ప్రమాదం జరిగితే కాస్త భయపడిన యాజమాన్యాలు, నేడు రాజకీయ అండదండలతో, ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో బాధితులకు నామమాత్రపు డబ్బులిచ్చి నోర్లు మూయిస్తున్నాయి. అధికారుల కళ్లు గప్పి విచ్చలవిడిగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. ఇటీవల సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పటాన్‌చెరు పారిశ్రామికవాడలో పేరుకుపోయిన అక్రమాలను, కార్మికుల ప్రాణాలకు ఏమాత్రం విలువ ఇవ్వని వైఖరిని, అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి తేటతెల్లం చేసింది. అసలు పరిశ్రమల్లో కార్మికులకు భద్రతకు గ్యారెంటీ ఉందా? అన్న ప్రశ్న తొలచివేస్తోంది.

- పటాన్‌చెరు రూరల్/మెదక్, జూలై 7 (ఆంధ్రజ్యోతి)


పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు మాత్రమే ఏదోలా బయటకొస్తున్నాయి. కానీ, ప్రమాదం జరిగిన కొన్నాళ్లకు తీవ్ర గాయాలతో నరకయాతన అనుభవించి మృతిచెందిన అభాగ్యుల లెక్కలు మాత్రం ఎక్కడా నమోదు కావడం లేదు. అంతటితో ఆగకుండా, ఈ మరణాలను కూడా కొందరు స్థానిక నాయకులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు నిత్యం వినవస్తున్నాయి. శవాల మీద చిల్లర ఏరుకుంటున్నట్లు, మృతుల కుటుంబాలకు లభించే పరిహారంలోనూ వాటాలు తీసుకుంటూ, ఈ కష్టాలనూ డబ్బుగా మార్చుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో హైదరాబాద్ కెమికల్స్, జయ విజయ అలాయిస్, విరూపాక్ష, అరబిందో, కిర్బీ, రేంటాస్, చైతన్య క్లోరైడ్ వంటి అనేక పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి ఎంతో మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కానీ, ఇంతవరకు ఏ ఒక్క పరిశ్రమపై కూడా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీనిబట్టి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు పరిశ్రమలను కనీసం తనిఖీ చేయకుండానే, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే నివేదికలు ఇచ్చేస్తున్నారని, వారి నిర్లక్ష్యం, అవినీతి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నైపుణ్యం లేని వలస కార్మికులు

పరిశ్రమల యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వకుండా, కార్మికులను పర్మినెంట్ చేయకుండా, ఎటువంటి భద్రతా ఏర్పాట్లు కల్పించడం లేదు. బినామీ కాంట్రాక్టర్ల ద్వారా బీహార్, ఒడిషా, జార్ఖండ్, యూపీ, కర్ణాటక వంటి సుదూర రాష్ట్రాల నుంచి వచ్చిన నైపుణ్యం లేని వలస కార్మికులను పనుల్లోకి తీసుకుంటున్నాయి. వీరితో రోజుకు 12 గంటల పాటు గొడ్డుచాకిరీ చేయిస్తున్నాయి. కెమికల్స్ మెషినరీపై కనీసం అవగాహన లేని ఈ అమాయకులను ప్రమాదకరమైన రియాక్టర్లలోకి దింపి శుభ్రం చేయించడం, రక్షణ పరికరాలు లేకుండా ప్రాణాంతకమైన కెమికల్స్‌ను మోయించడం వంటి పనులు చేయిస్తూ, తమ లాభాపేక్ష కోసం బలిపశువులను చేస్తున్నాయి.

ఉత్పత్తులకు అనుమతులున్నాయా?

దారుణమైన విషయం ఏమిటంటే, చాలా పరిశ్రమలు స్థాపించిన సమయంలో తీసుకున్న అనుమతులు ఒక ఉత్పత్తికి అయితే, ప్రస్తుతం మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా అనుమతులు లేని కొత్త ఉత్పత్తులను అక్రమంగా తయారు చేస్తున్నాయి. వీటి కోసం సొంతంగా, ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేని తాత్కాలిక ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తూ, అభం శుభం తెలియని అమాయక కార్మికులను వాడుకుంటున్నాయి. ఈ వాస్తవం పీసీబీ అధికారులకు తెలిసినా, వారికి మామూళ్లు ముట్టచెప్పడం ద్వారా పారిశ్రామికవేత్తలు అడ్డగోలుగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వినపిస్తున్నాయి. అనుమతులు తీసుకోవాలంటే లక్షలు ఖర్చు చేయాలి, బదులుగా అధికారులకు ముట్టజెబితే పని సులువు అవుతుంది అనే ధోరణి పారిశ్రామిక వర్గాల్లో నెలకొన్నదని విమర్శలు అంటున్నారు.



సిగాచి పేలుడు..
నిద్రమత్తులో అధికారులు

తాజాగా సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం ఎంసీసీపీ ఉత్పత్తుల నేపథ్యంలో జరిగిందని యాజమాన్యం చెబుతున్నా, అక్కడ సీఎంసీ (కార్బాక్సీ మిథైల్ సెల్యులోజ్) కూడా తయారు చేస్తున్నారని తెలుస్తోంది. ఎంసీసీపీని నీటితో శుభ్రం చేస్తే, సీఎంసీని పెట్రోల్‌తో సమానంగా మండే సాల్వెంట్‌తో శుభ్రం చేస్తారు. ఈ తేడా తెలిసి కూడా, నిబంధనలను ఉల్లంఘించి, కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి లాభాలు గడిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఈ పరిశ్రమలో ఉపయోగించే హైడ్రోజన్ పెరాక్సైడ్ వల్ల కూడా భారీ ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్ప్రే డ్రయ్యర్ వద్ద వాక్యూమ్ పంపు పనిచేయకపోవడం, లేదా వ్యాక్యూమ్ ఫిల్టర్ క్లాత్ శుభ్రం చేయకపోవడం, టెంపరేచర్ గేజ్ పనిచేయకపోవడం లేదా దానిని గమనించకపోవడం వంటి స్పష్టమైన నిర్లక్ష్య కారణాలతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఆపరేటర్, షిఫ్ట్ ఇన్‌చార్జిల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ప్రమాదానికి గల నిజమైన కారణాలను వెలికితీయడానికి అధికారులు నైట్ షిఫ్ట్ చేసిన ఆపరేటర్‌ను విచారించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్న.

'సిగాచి' పరిహారం నిజమైన బాధితులకు అందేనా?

(5వ పేజీ తరువాయి)

పరిహారం కొట్టేసేందుకు కొందరు ప్రత్నించడం విస్తుగొలుపుతున్నది.

మృతుడి భార్యనంటూ హల్‌చల్

ప్రమాదంలో మృతి చెందిన ఛోటేలాల్ అనే యువకుడి భార్యనంటూ ఒక యువతి ఆసుపత్రి వద్ద ఏడుస్తూ కనిపించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఛోటేలాల్ ఫొటోలను తన సెల్‌ఫోన్‌లో చూపించి, తన భర్త ఎక్కడున్నాడో చూపించాలని హల్‌చల్ చేసింది. అయితే, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఛోటేలాల్ తల్లి, అన్నలు అతనికి పెళ్లే కాలేదని తేల్చి చెప్పారు. ఈ యువతి గత ఆరు నెలలుగా ఛోటేలాల్‌తో సహజీవనం చేస్తోందని స్పష్టం చేశారు. అధికారులు ఛోటేలాల్ మృతదేహాన్ని అతని తల్లి, సోదరుడికి అప్పగించి రూ. లక్ష తక్షణ పరిహారం వారికే అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల పరిహారం ఎవరికి ఇవ్వాలనే విషయంలో అధికారులు మీమాంసలో పడ్డారు.

నకిలీ బాధితుల హంగామా.. ఎంపీ లేఖతో మోసానికి యత్నం

పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం వద్ద సోమవారం ఓ వ్యక్తి బాధితుడి బంధువునంటూ హంగామా చేశాడు. సిగాచీ ప్రమాదంలో మనోహర్‌రెడ్డి అనే కార్మికుడు చనిపోయాడని, తాను వారి కుటుంబ సభ్యుడిని అంటూ, తెలంగాణకు చెందిన ఒక ఎంపీ సిఫార్సు లేఖను చూపించాడు. సిగాచీ పరిశ్రమలో మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి లేకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి లోతుగా ఆరా తీయగా ఆ వ్యక్తి తడబడ్డాడు. గట్టిగా నిలదీయడంతో ఇప్పుడే వస్తానుని చెప్పి జారుకున్నాడు. అతను చూపించిన ఎంపీ లేఖ కూడా నకిలీదేనని తేలింది. ఆ వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆసుపత్రి పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

కుటుంబ వివాదాలు

ఒడిశాకు చెందిన ఓ మృతుడి అంత్యక్రియల విషయమూ వివాదంగా మారిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు స్వస్థలంలో చేస్తామని అనగా, అతని భార్య అందుకు అంగీకరించలేదు. ప్రస్తుతం తాము నివాసం ఉంటున్న ఇస్నాపూర్‌లోనే అంత్యక్రియలు పూర్తి చేశారు. పదేళ్లుగా తమకు కుటుంబ సభ్యులతో సంబంధాలు లేవని, పరిహారం కోసమే ఇప్పుడు వచ్చారని మృతుడి భార్య బహిరంగంగానే విమర్శించింది. తాను ఇస్నాపూర్‌లోనే ఉంటూ పిల్లలను చదివించుకుంటానని తెలిపింది. అయితే, గ్రామంలో కొడుకు కోసం ఎదురు చూస్తున్న వృద్ధ తల్లిదండ్రులకు పరిహారంలో కొంతైనా అందేలా చర్యలు తీసుకోవాలని వారి బంధువులు కోరుతున్నారు. పరిహారం నిజమైన లబ్ధిదారులకు అందకపోతే ఆశించిన ఫలితం దక్కదని, అధికారులు క్షుణ్ణంగా అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే పరిహారం అందించాలని అందరూ కోరుతున్నారు. ఈ మోసపూరిత ప్రయత్నాలను నిరోధించి, నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అధికారులకు ఒక సవాలుగా మారింది.

ఒలింపిక్స్ పతకాల సాధనే లక్ష్యం

- క్రీడల అభివృద్ధికి రూ.800 కోట్లు!
- హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ కోర్టు మంజూరు
- రాష్ట్ర క్రీడలు, యువజన, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

హుస్నాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడా పాలసీని తీసుకొచ్చారని రాష్ట్ర క్రీడలు, యువజన, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. క్రీడల అభివృద్ధి కోసం ఇప్పటికే బడ్జెట్‌లో రూ.800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివాసేనారెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ సోనీ బాలదేవీలతో కలిసి హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని సందర్శించారు. అనంతరం క్రీడాకారులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించి, రాష్ట్రానికి అంతర్జాతీయంగా పేరు తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు.



కబడ్డీ ఆడుతున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడాకారుల వినతి మేరకు హుస్నాబాద్‌లో స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ కోర్టు మంజూరు చేస్తున్నట్లు శ్రీహరి ప్రకటించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రీడల్లో హుస్నాబాద్ ప్రాంత క్రీడాకారులు నంబర్‌వన్‌గా నిలవాలని పిలుపునిచ్చారు. క్రీడలకు హుస్నాబాద్ ఎప్పటినుంచో పేరుగాంచిందని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని, వీటిని విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేసినందుకు మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడిన మంత్రులు

హుస్నాబాద్ మినీ స్టేడియంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివాసేనారెడ్డి, డైరెక్టర్ సోనీ బాలదేవీ కబడ్డీ ఆడి, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కబడ్డీ కోర్టుకు రెండు మ్యాట్‌లను మంజూరు చేశారు. అనంతరం మినీ స్టేడియం ఆవరణలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని, తమ తల్లుల పేరిట మొక్కలు నాటారు.

జిల్లాల రహదారులను అనుసంధానించాలి

- నిధుల కొరత లేదు
- రవాణా సౌకర్యాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కల్హేర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా రహదారులను అనుసంధానం చేయడం వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని ఫత్తేపూర్, కామారెడ్డి జిల్లా తిమ్మానగర్ గ్రామాల మధ్య నల్లవాగుపై రూ.4.86 కోట్లతో నిర్మించిన వంతెనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ఇందులో భాగంగానే అంతర్‌జిల్లా రహదారులను అనుసంధానం చేయడానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న రోడ్లు, భవనాల శాఖ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డిని మంత్రి ఆదేశించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంతో పాటు, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రహదారులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే కల్హేర్-మాసన్‌పల్లి రహదారి సమస్య తన దృష్టిలో ఉందని, మిగతా రహదారుల నిర్మాణానికి కూడా నిధులు మంజూరవుతాయని హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా సరిహద్దు వరకు ఉన్న డబుల్ లేన్ రహదారిని కల్హేర్ మండలం ఫత్తేపూర్ చౌరస్తా వరకు విస్తరించాలని ఎంపీ మంత్రిని కోరారు. తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అనంతరం నల్లవాగుపై నిర్మించిన వంతెనను కల్హేర్ మండలం ఫత్తేపూర్ గ్రామ సరిహద్దు వరకు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సగ్వాన్, ఎస్పీ రాజేష్ చౌహాన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ పొన్న మోహన్, నారాయణఖేడ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కల్హేర్ మండలంలోని బాచేపల్లి గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై మంత్రికి, ఎంపీ, ఎమ్మెల్యేలకు నారాయణఖేడ్ నియోజకవర్గ నాయకులు పూల కిరీటం, బోకేలతో ఘన స్వాగతం పలికారు.



వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- బాధితులకు భరోసా కల్పించండి!
- సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్ల ఆదేశం



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి/మెదక్/సిద్దిపేట రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన ప్రజావాణిపై బాధితులకు భరోసా కల్పించాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. మూడు జిల్లాల కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో కలెక్టర్లు ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సంగారెడ్డిలో పాటు పింఛన్ మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక అర్జీలు అందాయి. మెదక్ ప్రజావాణికి మొత్తం 61 అర్జీలు (భూ సమస్యలు 29, ఇళ్లు 7, పింఛన్ 4, ఇతర సమస్యలు 21) అందగా, సిద్దిపేట ప్రజావాణికి 152 అర్జీలు వచ్చాయి. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు 11 ఫిర్యాదులు స్వీకరించారు. సిద్దిపేట కలెక్టర్ హైమావతి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి మంగళవారం, శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు మండలంలో పర్యటించి పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి, వనమహోత్సవం సహా ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. సంగారెడ్డిలో హెలెన్ కెల్లర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో
మైక్రోఫైనాన్స్ మహమ్మారి

రుణ ఉచ్చులో మల్లన్నసాగర్ నిర్వాసితులు

ఉపాధి లేక.. తప్పని ఆస్తులు తాకట్టు

ఇప్పటికే వందకుపైగా ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ నిర్లక్ష్యం.. బతుకులు ఆగమాగం

ఒకప్పుడు పచ్చని పొలాలతో.. పశుసంపదతో సంతోషంగా ఉన్న వారి జీవితాలు.. నేడు దైన్యంగా మారాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో వ్యవసాయభూములు పోయి, ఉపాధి మార్గాలు కరువై బతుదెరువుకు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో పునరావాస కాలనీలో వారికిచ్చిన గృహాలను తాకట్టు పెట్టే దుస్థితి దాపురించింది. వారి ఆశ, కలలు.. అన్నీ మైక్రోఫైనాన్స్ మెట్లపై అప్పుగా మారుతున్నాయి.


గజ్వేల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ప్రభుత్వాలు మారినా, తమకు ఉపాధి మార్గం దొరక్కపోవడంతో బతుకుతెరువు కోసం తమ పునరావాస కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఫ్లాట్లను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఏకంగా వందకుపైగా ఫ్లాట్లను మల్లన్నసాగర్ నిర్వాసితులు మైక్రోఫైనాన్స్ సంస్థలకు తాకట్టు పెట్టి రుణాలు పొందారు. ఉపాధి లేక, బతికే మార్గం కనిపించక, తెచ్చుకున్న అప్పులతోనే జీవనం సాగిస్తున్నారు. కొంతమంది వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటుండగా, మరికొంతమంది ఈ తాకట్టు రుణాలపైనే ఆధారపడి బతుకుతున్నారు. నాలుగేళ్లుగా తమ బాగోగులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం తమను ఆగం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా తమ సమస్యలపై ఎలాంటి చొరవా చూపడంలేదని భూ నిర్వాసితులు వాపోతున్నారు.

మార్ట్‌గేజ్ రుణాలు

నిర్వాసితుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని తాకట్టు రుణాల పేరిట మైక్రోఫైనాన్స్ సంస్థలు రంగంలోకి దిగుతున్నాయి. దాదాపు 15 ఏళ్ల క్రితం మైక్రోఫైనాన్స్ సంస్థల ఆగడాలు మితిమీరి, రాష్ట్రంలో అనేక మంది రైతులు, నిరుపేదలు ఆత్మహత్యలు చేసుకున్న చేదు జ్ఞాపకాలను మరువలేం. ఇప్పుడు మరోసారి, మల్లన్నసాగర్ నిర్వాసితులతో పాటు ఇతర ప్రజల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు ఈ సంస్థలు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకుని నగదు అందజేస్తున్నాయి. ఈ క్రమంలో మల్లన్నసాగర్ భూ నిర్వాసిత ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ కింద వచ్చిన ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ (మార్ట్‌గేజ్) చేసుకుని రుణాలు ఇస్తున్నాయి. రూ.25 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకే మార్ట్‌గేజ్ చేసుకుంటున్నాయి. కొన్ని రోజుల తర్వాత డబ్బు తిరిగి ఇవ్వని పక్షంలో సదరు ఫ్లాట్లను వేలం వేయడం లేదా తమ సొంతం చేసుకోవడమే ఈ మైక్రోఫైనాన్స్, హౌజింగ్ ఫైనాన్స్ సంస్థల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. నిర్వాసితుల ఆస్తులను కారుచౌకగా కొట్టేయడమే వీరి ఉద్దేశం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధి లేకపోవడమే అసలు సమస్య

గజ్వేల్ నియోజకవర్గంలో నిర్మించిన మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసిత కాలనీలకు చెందిన ప్రజలకు ఉపాధి మార్గాలు లేకపోవడమే ఈ సంక్షోభానికి మూల కారణం. వ్యవసాయం చేసుకునే భూమి పోవడం, పశుసంపదను పెంచుకునే అవకాశం లేకపోవడం, కూలీ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో, అత్యవసరానికి తమకు ప్రభుత్వం ఇచ్చిన ఫ్లాట్లను తాకట్టు పెట్టి రుణాలు పొందక తప్పని పరిస్థితి. ఈ అప్పులను తిరిగి తీర్చే మార్గం కూడా వారికి కనిపించడం లేదు. గత ప్రభుత్వం ఉపాధి కల్పనపై ఏమాత్రం ఆలోచించకపోగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా భూనిర్వాసితుల సమస్యలపై కనీసం సమీక్ష కూడా చేయకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. వారి భవిష్యత్తుపై కమ్ముకున్న నీలినీడలు ఎప్పుడు తొలగిపోతాయో, ఏ ప్రభుత్వం తమకు అండగా నిలుస్తుందోనని వారు నిరీక్షిస్తున్నారు.



80 శాతం ఆదాయం తాకట్టు రిజిస్ట్రేషన్లవే..

గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి నెలా 150కి తగ్గకుండా మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్లు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తున్న ఆదాయంలో 80 శాతం ఆదాయం ఈ మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ల ద్వారానే వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నెల వారీగా మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్లు చూస్తే.. జనవరిలో 197, ఫిబ్రవరిలో 191, మార్చిలో 302, ఏప్రిల్ 209, మేలో 190, జూన్‌లో 188, జూలైలో మూడు రోజుల్లోనే ఏడు మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఈ రిజిస్ట్రేషన్లలో ప్రతీ నెల సగటున ఇళ్లు కట్టుకునే వారు తీసుకునే బ్యాంకు రుణాలకు సంబంధించిన మార్ట్‌గేజ్‌లు కాగా, మిగిలినవన్నీ తాకట్టు రుణాలుగానే అధికారులు నిర్ధారించారు. ఇది నిర్వాసితుల దుస్థితికి అద్దం పడుతోంది.

న్యూస్ బాక్స్

ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దశంకరంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధి గొట్టి ముక్కులలోని ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ధర్నా

నారాయణఖేడ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హసీనాబేగంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ జిల్లా కార్యదర్శి రమేష్, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు బస్వరాజ్, నాయకులు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్

కంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. సోమవారం కందిలో సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్‌ను నియమించారు. ఈ సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల నాయకులు మరళీ, ఆంజనేయులు, నర్సింలు, వెంకటేష్, రాజేందర్, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

నాగల్‌గిద్ద, జూలై 7(ఆంధ్రజ్యోతి): బాలికల, మహిళల రక్షణ భద్రతే లక్ష్యంగా షీటీం పని చేస్తుందని షీటీం ఖేడ్ డివిజన్ ఇన్‌చార్జి ఏఎస్ఐ తులసీరాం, కానిస్టేబుల్ చాంగుబాయి అన్నారు. సోమవారం నాగల్‌గిద్ద జడ్పీ ఉన్నత పాఠశాలలో షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రైతుల సమస్యలపై దృష్టి

కొల్చారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కొల్చారం రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి భూ సమస్యలు ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారు నేరుగా వచ్చి కార్యాలయంలో సంప్రదిస్తే వారి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అంబేడ్కర్ సేవా సమితి మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

హత్నూర, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ సేవా సమితి హత్నూర మండల అధ్యక్షుడిగా ముచ్చర్ల గ్రామానికి చెందిన మచ్చురి శ్రీకాంత్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ సేవా సమితి కార్యవర్గాలను ఏర్పాటు చేస్తానన్నారు.

'సోషల్ ఆడిట్‌కు సహకరించాలి'

పెద్దశంకరంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహిస్తున్న సామాజిక తనిఖీకి అధికారులు సహకరించాలని ఎస్ఆర్‌పీ నాగరాజు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై చర్చించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా నారాయణనాయక్

మెదక్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నారాయణనాయక్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎస్ఈగా పని చేసిన శంకర్ గతనెలలో ఉద్యోగ విరమణ చేశారు. దాంతో హైదరాబాద్‌లో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న నారాయణనాయక్‌ను మెదక్ జిల్లా ఎస్ఈగా నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నూతన ఎస్ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వెంకట ఖ్వాజా ఆశ్రమంలో సప్తభజన ప్రారంభం

వట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సర్వమత సన్నిధి అయిన వెంకట ఖ్వాజా ఆశ్రమంలో 110వ జయంతి సందర్భంగా సప్తభజన సోమవారం ప్రారంభించారు. ఏడు రోజులపాటు 24 గంటలు భక్తులు భక్తిశ్రద్ధలతో భజన చేస్తారు. భజనకు హాజరయ్యే భక్తులకు భోజన వసతి ఏర్పాట్లు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

హవేళిఘణపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత సరఫరా, రైతుభరోసా, రైతుబీమా, రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. కొందరు ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి తప్పించుకుంటారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. నా శ్వాస ఉన్నంతవరకూ ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాం, నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, సుభాష్, బాలకిషన్‌రావు, చంద్రశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.



హవేళిఘణపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న రోహిత్‌రావు

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మున్సిపల్‌గా మారిన విలీన గ్రామాల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి, పటేల్‌గూడ పరిధిలోని హరివిల్లు కాలనీ, ఇందిరమ్మ కాలనీలో రూ.కోటితో చేపడుతున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వేగంగా అభివృద్ధి జరగాలని, అందుకు నిధుల కొరత ఉండకూడదన్న లక్ష్యంతోనే ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఇకపై అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, మాజీ వైస్ ఎంపీపీ సునీత, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, డీఈ వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.



పటేల్‌గూడ హరివిల్లు టౌన్‌షిప్‌లో సిసిరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి

● మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్/చేగుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. సోమవారం రాయికోడ్ మండల పరిధిలోని నాగ్వార్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, నూతన గృహాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, విఠల్, పండరి, శ్రీనివాస్, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదోడి సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజేష్, సుధాకర్, శ్రీనివాస్, మధు, శంకర్‌నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగ్వార్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అంజయ్య

పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి : తపస్

సంగారెడ్డి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీయూఎస్(తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు కోరారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించి, మాట్లాడారు. 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే కమిషన్ నుంచి నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలం జీతం చెల్లించి మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని కోరారు. జేఏసీలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన మేరకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు కేంద్ర ప్రభుత్వం మాదిరిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, సుధాకర్, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్, పూర్వ ప్రధాన కార్యదర్శి అడివప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సభ్యత్వాన్ని అందజేస్తున్న తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

ఇళ్లు, షాపులు కోల్పోతున్న పేదలను ఆదుకుంటాం

● ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ

కంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి- మదీనాగూడ వరకు ఆరులైన్ల రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోతున్న పేదలను ఆదుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ అన్నారు. సోమవారం కందిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన నేషనల్ హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కందిలో కొన్నేళ్లు రోడ్డుపక్కనే చిన్నచిన్న షాపులు పెట్టుకుని బతుకుతున్న వారికి రోడ్డు విస్తరణతో నష్టం జరుగుతుందని మైనార్టీ జిల్లా నాయకుడు ఖాజాఖాన్ డీఈ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన డీఈ రామకృష్ణ గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలని కోరారు. రోడ్డు పెద్దగా ఉంటేనే ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇళ్లు, షాపులు కోల్పోతున్న పేదలకు తగిన నష్ట పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుండి సత్తయ్య, చాంద్‌పాష, మురళీ, సత్తార్‌ఖాన్, షేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



కందిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ

ఆధ్యాత్మిక చింతన అవసరం

జహీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఆషాఢ ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలను జహీరాబాద్ పట్టణంలో నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలో సోమవారం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని గడీ మహేళాలో నిర్వహించిన మొహర్రంలో పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

బదిలీలతోపాటు పదోన్నతులు చేపట్టాలి

మెదక్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీలతోపాటు పదోన్నతలు ప్రక్రియ చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఇంటర్ విద్యను స్కూల్ ఎడ్యుకేషన్‌లోకి తీసుకొచ్చి అర్హత కలిగి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఇన్‌చార్జిల స్థానంలో రెగ్యులర్ డీఈవో, ఏంఈవోలను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న మెడికల్, భవిష్యనిధి చెల్లింపులను వెంటనే చేపట్టాని కోరారు. ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో దీర్ఘకాలిక ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడ్డి, సీనియర్ రాష్ట్ర కౌన్సిలర్లు సంగయ్య, హిరాలాల్, రాజేంద్రప్రసాద్, సంగీత, దదర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు పేరుతో దోపిడీ

● ఆత్మగౌరవం, మర్యాద లేని చోట మేం ఉండలేం

● సొంత గూటికి బీఆర్ఎస్ నాయకులు



బీఆర్ఎస్ భవన్‌కు బయల్దేరుతున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధి దేవుడెరుగు.. మార్పు పేరుతో మరో దోపిడీ జరుగుతుందని.. ఆత్మగౌరవం, మర్యాద లేని చోట మేం ఉండలేమంటూ కాంగ్రెస్ నాయకులు గంగా నరేందర్, జీవన్‌రావు, మైనంపల్లి రంగారావ్, మెంగని విజయలక్ష్మిలతో పాటు సుమారు వంద మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌కు చేరుకుని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి, మల్లిఖార్జున్‌గౌడ్, నాయకులు సోములు, మామిళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు బీఎంఎస్ దూరం

● జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : 9న జరిగే సార్వత్రిక సమ్మెలో బీఎంఎస్ పాల్గొనడం లేదని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇది కార్మికుల సమస్యలపై సమ్మెకాదని రాజకీయాలతో ముడిపడిన సమ్మె నేపథ్యంలో సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిగత స్వలాభాలు, రాజకీయ అవసరాల కోసం సమ్మె తప్ప కార్మికుల సంక్షేమం కోసం కనబడటం లేదని ఎద్దేవా చేశారు. కార్మిక సంక్షేమం తప్పా రాజకీయాల జోలికి బీఎంఎస్ వెళ్లదని గుర్తు చేశారు. తెలంగాణలో కమ్యూనిస్టులు కనుమరుగు దశలో ఉన్నారని ఆరోపించారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

హత్నూర/సంగారెడ్డిరూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ సర్కార్ కార్మికుల పొట్ట కొడుతూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని దౌల్తాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు మంగ, మండల నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భూషణం పాల్గొన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని తూప్రాన్ పట్టణంలో ఐఏటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఏటీఈయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నందన్ పాల్గొన్నారు.

చదువుతోనే వెలుగు

● చార్టర్డ్ అకౌంటెంట్ ఆదిరానాయణ

సిర్గాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే వారి జీవితంలో వెలుగులు నిండుతాయని హెల్పింగ్ హాండ్స్ షర్పూర్ స్వచ్ఛంద సంస్థ చీఫ్ అడ్జైర్, చార్టర్డ్ అకౌంటెంట్ ఆదినారాయణ అన్నారు. సిర్గాపూర్ మండలం బొక్కాస్‌గావ్ గ్రామంలో మండల పరిషత్ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు రూ.60 వేల విలువ చేసే స్కూల్ కిట్లను సోమవారం ఉచితంగా అందజేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆర్గనైజర్ భరత్‌కుమార్, ధన్నారం కార్తీక్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కె.నర్సింగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జయప్రకాష్, శాదుల్, సరేష్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

జీవో 282ను ప్రభుత్వం రద్దు చేయాలి

సంగారెడ్డి రూరల్/చేగుంట/శివ్వంపేట/నర్సాపూర్/రామాయంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పని గంటలు పది గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి జీవో 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. చేగుంటలోని గాంధీ చౌరస్తా వద్ద సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో జీవో 282 ప్రతులను దహనం చేశారు. శివ్వంపేట మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కమలాద్రికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. నర్సాపూర్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు ఆధ్వర్యంలో జీవో 282కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. రామాయంపేట పాత హైవేపై ధర్నా చేసి, జీవో ప్రతులను దహనం చేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు



చౌటకూర్‌లో ఎగురవేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్రమాదిగ



మెదక్ జిల్లా కేంద్రంలో ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు



గడీలో పీర్లను దర్శించుకున్న మాజీమంత్రి డా.చంద్రశేఖర్ తదితరులు

జహీరాబాద్/కల్హేర్/వట్‌పల్లి/రేగోడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని గడీవీధిలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొని పీర్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, ఉత్సవకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కల్హేర్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రధాన కూడళ్లలో పెద్ద, చిన్న పీర్లను ఊరేగించారు. అలాగే వట్‌పల్లి మండలంలోని షాద్నగర్, పాలడుగు గ్రామాల్లో, రేగోడు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు.

మున్సిపాలిటీలో రాళ్లకత్వ విలీనం తగదు



రాస్తారోకో నిర్వహిస్తున్న స్థానికులు

జిన్నారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ రాళ్లకత్వలో స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల భూముల స్వాధీనానికి మున్సిపాలిటీ పేరుతో ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. ఇటీవల తమ గ్రామ పరిధిలో 286 సర్వే నెంబరు భూములల్లోని రైతులకు అధికారులు నోటీసులు ఇవ్వడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ప్రజలు, రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా పంచాయతీ పాలనను తొలగించడం ప్రభుత్వానికి తగదని, వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేటివ్ ఇండియన్స్ ఫోరం రాష్ట్ర వలంటీర్ చీఫ్‌గా పల్వనూరి శేఖర్



శేఖర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు బీరయ్యయాదవ్

సంగారెడ్డి అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నేటివ్ ఇండియన్స్ ఫోరం వలంటీర్ ఫోర్స్ రాష్ట్ర చీఫ్‌గా కంది మండలం చిమ్నాపూర్ గ్రామానికి చెందిన పల్వనూరి శేఖర్ నియమితులయ్యారు. సంగారెడ్డిలో జాతీయ అధ్యక్షుడు బీరయ్యయాదవ్ సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీరయ్యయాదవ్ మాట్లాడుతూ భారత మూలనివాసుల హక్కులు, సంస్కృతిని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బత్తుల విక్రమ్, నాయకులు నుమాన్‌అహ్మద్, సిద్దిఖీ, మున్నా, అంజత్, అహ్మద్, సంఘమేశ్వర్, అఖిల్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయుడికి ప్రత్యేక పుష్పార్చన

నారాయణఖేడ్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ శివారులోని భక్తమార్కండేయస్వామి వారి ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక పుష్పార్చన, అభిషేకం, మహాహారతి, పుష్పార్చన, పుష్పాభిషేకం, గీతా పారాయణం, హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామావళి, ప్రత్యేక పూజలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అంజమ్మ, కేశవులు ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు.

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొల్చారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాంపూర్ గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గతంలో ప్రజాప్రతినిధుల అండదండలతో ఆరు ఎకరాలు భూమితో పాటు రెండు కుంటలను కబ్జాచేశారని వివరించారు. మూడునెలల క్రితం గ్రామస్థులందరం కలిసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. గతంలో ఉన్న తహసీల్దార్ 373 సర్వే నెంబర్లు ఉన్న ప్రభుత్వ భూమితో పాటు కప్పలకుంత, తేనెలకుంట కబ్జాకు గురికావడంతో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. ఆదివారం ఆ ప్రజాప్రతినిధి సాగుచేసుకునేందుకు వెళ్లారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఇందులో నెల్లి రాజు, విఠల్‌రెడ్డి, సోమశేఖర్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

విఠలేశ్వర మందిరంలో హోమం, పూజలు

పెద్దశంకరంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాస ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని విఠలేశ్వరస్వామి మందిరంలో సోమవారం భక్తులు హోమం, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు హోమంలో పాల్గొన్నారు. సాయంత్రం రుక్మిణీ విఠలేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకీలో ఉంచి పట్టణ వీధుల గుండా ఊరేగించారు. నేడు రుక్మిణీ, విఠలేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : యూపీఎస్సీ సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్టు సర్కిల్ సంచాలకుడు ప్రవీణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 30 ఏప్రిల్, 2026 వరకు హైదరాబాద్ సైదాబాద్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో గల బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తామన్నారు. 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, వీరిలో 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను 12న నిర్వహించే ఆన్‌లైన్ స్ర్కీనింగ్ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తామన్నారు. పూర్తి వివరాలకు 06455-277015, 9494390803 నంబర్లలో, లేదా సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలన్నారు.

డంపింగ్‌యార్డు విషయంలో రాజకీయాలు వద్దు

గుమ్మడిదల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : డంపింగ్‌యార్డు విషయంలో తాము రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తున్నామని, ప్రజల ప్రయోజనమే తమకు ముఖ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని సోమవారం సీజీఆర్ ట్రస్టు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్‌యార్డు విషయంలో మేము మొదటి నుంచీ రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తున్నామన్నారు. ప్రస్తుతం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మద్రాసులో దాఖలైన పిటిషన్ నేడు విచారణకు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. డంపింగ్‌యార్డు విషయంలో అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నల్లవల్లి మాజీ సర్పంచ్ దోమడుగు శంకర్, జేఏసీ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.